

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఆదివారం 01-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :134 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

'పుర' పోరుకు సర్వం సిద్ధం



- 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో ఓటింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్
- 36 వేల మందికి పైగా పోలీసులతో భద్రత
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- నవంబర్ 3న ఓట్ల లెక్కింపు

సర్కార్ ఆస్పత్రుల్లో ఉచిత ఎంఆర్ఐ!

- పీపీపీ విధానంలో సేవల విస్తరణ
- మహబూబ్‌నగర్‌లో పైలట్ ప్రాజెక్ట్
- రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- తమిళనాడు మోడల్‌పై అధ్యయనం
- ప్రభుత్వానికి 20 శాతం ఖర్చు తగ్గింపు
- ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లే బాధ తప్పేనా?
- పేదలకు అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యం



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడ్‌లో ఈ సేవలను రోగులకు అందుబాటులోకి తేనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. పీపీపీ విధానం అమల్లోకి వచ్చినప్పటికీ ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే పేషెంట్లకు ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

సరూర్‌నగర్‌లో అండాల దందా గుట్టురట్టు!

- ఇంటిపై పోలీసుల ఆకస్మిక దాడులు
- 18 మంది యువతులు అదుపులోకి
- కాలేజీ విద్యార్థినులే ముఠా టార్గెట్
- డబ్బు ఆశ చూపి అండాల సేకరణ
- ఇంజెక్షన్లతో అండాలు సేకరిస్తున్న ముఠా
- ఐవీఎఫ్ కేంద్రాలకు అక్రమ సరఫరా 2 లో
- ముఠా వెనుక సూత్రధారులపై పోలీసుల ఆరా

ఇస్రో సత్తాకు ప్రధాని కితాబు!

- NVS-03 ప్రయోగం విజయవంతం
- ఇస్రో శాస్త్రవేత్తలకు మోడీ అభినందనలు
- నిర్దిష్ట కక్ష్యలోకి ఉపగ్రహం
- NavIC వ్యవస్థకు మరింత బలం
- స్వదేశీ సాంకేతికతలో మరో ముందడుగు
- జితేంద్ర సింగ్ ప్రశంసలు
- అంతరిక్ష రంగంలో భారత్ దూకుడు



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన GSLV-F18-NVS-03 మిషన్ విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. NVS-03 ఉపగ్రహాన్ని నిర్ణయించిన కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు అభినందనలు తెలిపారు. శనివారం ఉదయం సోషల్ మీడియా వేదిక Xలో స్పందించిన ప్రధాని మోడీ, భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, ప్రతిభ దేశానికి నిరంతరం గర్వకారణంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అధునాతన సామర్థ్యాలతో రూపొందించిన NVS-03 ఉపగ్రహం కీలక సాంకేతిక రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించే ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు.

2 లో

ప్రభుత్వ ఆస్తులను చౌకగా అమ్మేస్తారా?

- ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆస్తులు
- ఐడీబీఐ వ్యాల్యుయేషన్‌పై అనుమానాలు
- రిజర్వ్ ధర కంటే తక్కువ బిడ్లు
- నిబంధనలు మార్చాల్సిన అవసరమేంటి?
- కీలక నగరాల్లో బ్యాంక్‌కు విలువైన ఆస్తులు
- హైదరాబాద్ భూముల విలువపై సందేహాలు 2 లో
- ఉద్యోగుల ఆందోళనలను పట్టించుకోవడం లేదా?

ఖైదీల పరారిపై సీఎం విజయ్ కొరడా!

- తేని జైలు నుంచి 17 మంది పరార్
- డిప్యూటీ సూపరింటెండెంట్‌పై వేటు
- 17 మంది సిబ్బంది సస్పెండ్
- పరారైన ఖైదీలందరూ మళ్లీ అరెస్ట్
- వారం రోజుల్లో రెండు ఘటనలు 2 లో

"ఢిల్లీనా.. ఢాకానా?" .. బంగ్లాలో రచ్చ!



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా దిగిపోయిన తర్వాత భారత్ వ్యతిరేక నినాదాలు వినిపించాయో, మరోసారి ఇలాంటి నినాదాలే వినిపిస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్యుత్ సంక్షోభం, ఇంధన, గ్యాస్ కొరతపై ప్రధాని తారిఖ్ రెహమాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి నేతలు నిరసనలకు దిగారు.

పాత నేతలతో కొత్త చిక్కులు!



- కొండా సురేఖ యూటర్న్!
- కేటీఆర్‌పై వ్యాఖ్యల ఉపసంహరణ
- కారు ఎక్కేందుకు నేతల క్యూ?
- చేరికలపై గులాబీ పార్టీలో గుబులు
- కష్టకాలంలో వదిలిన వారికే స్వాగతమా?
- సోషల్ మీడియాలో గులాబీ క్యాడర్ ఫైర్
- కేసీఆర్‌కు చేరికల కొత్త చిక్కులు
- పాత నేతలా? పార్టీ క్యాడరా? కేసీఆర్‌దే నిర్ణయం!

న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాలు మరోసారి ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. రాబోయే ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకురాబోయే కొత్త పథకాలే వచ్చే ఎన్నికల్లో మాకు విజయాన్ని అందిస్తాయని అధికార కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తుండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు అధికార పార్టీకి గట్టి పోటీ ఇచ్చేందుకు రాజకీయ సమీకరణాలపై దృష్టి సారిస్తున్నాయి. అయితే ఈ రాజకీయ పోరులో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. గులాబీ గూటికి పాత నేతలు? తిరిగి రాబోతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.

మిగతాది 2 లో..

నీటి ఎద్దడిపై సర్కార్ అలర్ట్!

- ఎల్‌నినో ప్రభావంపై సీతక్క అప్రమత్తం
- తాగునీటి అవసరాలకు ప్రత్యేక నిధులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు కోటి చొప్పున కేటాయింపు
- బోర్లు, ట్యాంకర్లతో నీటి సరఫరా
- స్థానిక నీటి వనరులు సిద్ధం చేయాలి



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని మంత్రి సీతక్క తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు, ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఈ నిధులతో అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేసి, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

టెక్స్‌టైల్ రంగానికి కేంద్రం బూస్ట్!



- పత్తి దిగుమతులపై సుంకం మినహాయింపు పొడిగింపు
- డిసెంబర్ 31 వరకు గడువు పెంపు
- టెక్స్‌టైల్ పరిశ్రమకు భారీ ఊరట
- తగ్గనున్న తయారీ వ్యయం
- ముడిసరుకు లభ్యతకు మార్గం సుగమం
- చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి 2 లో

బాలికపై కిరాతక దాడి.. నిందితుడి అరెస్ట్!

- ధర్మవరంలో నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- పాఠశాలలోకి చొరబడి ఎలక్ట్రిక్ రంపంతో దాడి
- గొంతు, ముఖంపై విచక్షణారహితంగా దాడి
- తెగిపోయిన కుడిచేయి.. మృత్యువుతో పోరాటం
- అనంతపురం ఆసుపత్రిలో బాలికకు చికిత్స
- ఘటనపై కుటుంబ సభ్యుల ఆగ్రహం
- పాఠశాలలో ఐదుగురు టీచర్లే ఉన్నారని వెల్లడి



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన దారుణ ఘటనలో నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పాఠశాల ఆవరణలోకి హఠాత్తుగా చొరబడి బాలిక గొంతు, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి పరారైన ఆ ఉన్మాది కోసం ముమ్మరంగా గాలించిన పోలీసులు, అతడిని ధర్మవరంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందింది.

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

ఆదివారం 01-11-2026

సరూర్‌నగర్‌లో అండాల దందా గుట్టురట్టు!



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అక్రమ అండాల సేకరణ దందా తీవ్ర కలకలం రేపుతోంది. బేగంపేట ఘటన మరువకముందే మరోచోట వెలుగుజూసింది. తాజాగా సరూర్ నగర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఒక ఇంట్లో కాలేజీ విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న అండాల విక్రయాల ముఠాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివారాల్లోకి వెళితే.. విశ్వసనీయ వ్యక్తుల సమాచారంతో సరూర్ నగర్ పోలీసులు సదరు నివాసంలో ఆకస్మిక దాడులు నిర్వహించి, అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులను ఆసరాగా చేసుకుని ఈ దందా నడుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వారికి పెద్ద మొత్తంలో డబ్బుల ఆశ చూపి, ఇంజెక్షన్లు ఇచ్చి అండాలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సేకరించిన ఈ అండాలను నగరంలోని కొన్ని ప్రముఖ ఐవీఎఫ్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి.

పోలీసులు అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. వీరి వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? ఈ ముఠాతో ఏ ఏ ఐవీఎఫ్ సెంటర్లు చేతులు కలిపాయనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా అక్రమ అండాల సేకరణ, సరోగసీ ముఠాల అక్రమాలు వరుసగా బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సరూర్ నగర్ తరహాలోనే ఇటీవల బేగంపేట, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లోని గర్ల్స్ హాస్టళ్లపై పోలీసులు విరుచుకుపడ్డారు. హాస్టళ్ల పేరుతో ఇతర రాష్ట్రాల (బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా) నుంచి యువతులను నగరానికి రప్పించి, వారి నుంచి చట్టవిరుద్ధంగా అండాలను సేకరిస్తున్న ముఠాలను రట్టు చేశారు. వరుసగా ఈ దందా ఘటనలు బయటపడుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

నీటి ఎద్దడిపై సర్కార్ అలర్ట్!

మొదటి పేజీ తరువాయి

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక వనరులను వినియోగించుకోవడంతో పాటు, అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

స్థానిక నీటి వనరులు అందుబాటులో ఇంచాలి:

చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు తదితర స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి, అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు.

రెండు రోజుల్లో పూర్తి చేయాలి:

ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలో నీరు ఇంకేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పురోగతిలో ఉన్న నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ విభాగాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

బాలికపై కిరాతక దాడి.. నిందితుడి అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి

ఇక.. ఈ పాశవిక ఘటన రాప్తాడు మండల కేంద్రంలో తీవ్ర కలకలం రేపింది. పాఠాలు వింటున్న సమయంలో ఒక్కసారిగా ప్రవేశించిన ఆగంతకుడి దాడిలో తీవ్రంగా గాయపడి, కుడి చేయి తెగిపోయి రక్తపు మడుగులో కుప్పకూలిన అయ్యవారిపల్లెకు చెందిన సదరు విద్యార్థిని ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అత్యవసర విభాగంలో మృత్యువుతో పోరాడుతోంది.



వైద్యులు ఆమెను కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని సాక్ష్యాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టి, చివరకు నిందితుడిని ధర్మవరంలో పట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై బాధిత బాలిక కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంపంతో స్కూల్‌లోకి దుండగుడు ప్రవేశించడం ఏంటని బంధువులు నిలదీశారు. మరోవైపు.. క్లాస్ టీచర్ సైతం ఈ ఘటనపై స్పందించారు. "సెకండ్ హవర్ క్లాస్ జరుగుతుండగా దుండగుడు వచ్చాడు.. ఒక్కసారిగా దుండగుడు రావడంతో విద్యార్థులు పరుగులు తీశారు.. దుండగుడు ఒక్కడే వచ్చి ఘాతుకానికి పాల్పడ్డాడు.. బయట ఎంత మంది ఉన్నారో చూడలేదు.. నేడు పోలింగ్ ఉండటంతో మిగతా టీచర్లు ఎవరూ లేరు.. స్కూల్‌లో కేవలం ఐదుగురు టీచర్లు మాత్రమే ఉన్నాం" అని క్లాస్ టీచర్ వివరించారు.

'పుర' పోరుకు సర్వం సిద్ధం



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల పరిధిలో నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. ఓటింగ్ ప్రక్రియ కోసం అధికారులు పంపిణీ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సుల పంపిణీ చేశారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఎన్నికలను నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం 36,351 మంది పోలీసు సిబ్బందితో 4,372 పోలింగ్ స్టేషన్ల పరిధిలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలోని 671 అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయగా, 1,233 సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ఇక పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఎన్నికల పర్యవేక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు 1,543 రూట్ మొబైల్ బృందాలను రంగంలోకి దింపారు.

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, సంబంధిత కేసుల్లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 107 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఓటింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన 111 స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 4,655 మంది పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో అవాంఛనీయ ఘటనలు జరిగి పోలింగ్ ఆగిపోతే, అటువంటి ప్రాంతాల్లో నవంబర్ 2న రీపోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

ఖైదీల పరారిపై సీఎం విజయ్ కొరడా!



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): మిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది ఖైదీలు తప్పించుకున్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనకు సంబంధించి జైలు అడ్మినిస్ట్రేషన్, భద్రతా పర్యవేక్షణలో వైఫల్యం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో తేని జిల్లా జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకున్నారు. పలువురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిని బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏఎన్ఐ నివేదిక ప్రకారం, ఆగస్టు 2024 నుంచి తేనిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ ఎన్. రామలింగంపై జైలు పరిపాలన, భద్రతా పర్యవేక్షణలో వైఫల్యానికి సంబంధించి చర్యలు తీసుకున్నారు. మొత్తం 17 మంది సిబ్బందిపై సస్పెన్షన్ చర్యలు చేపట్టి, వారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

తేని జైలు నుంచి పరారైన 17 మంది ఖైదీలు

తేని జిల్లా జైలు నుంచి తప్పించుకున్న మొత్తం 17 మంది ఖైదీలను పోలీసులు తిరిగి అదుపులోకి తీసుకున్నట్లు వార్తా సంస్థ పిటీఐ పోలీసు వర్గాలను ఉటంకిస్తూ తెలిపింది. పట్టుబడిన ఖైదీలను రాష్ట్రంలోని వివిధ హై-సెక్యూరిటీ జైళ్లకు తరలించే ప్రక్రియను అధికారులు ప్రారంభించినట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత తమిళనాడులోని అన్ని జైళ్లలో భద్రతా ఏర్పాట్లు, నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఒకే వారంలో రెండు జైలు పరార్ ఘటనలు

తేని జిల్లా జైలు ఘటనకు ముందు అక్టోబర్ 20న చెన్నై సమీపంలోని పుజల్ హై-సెక్యూరిటీ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు కూడా పరారైనట్లు సమాచారం. వారిని పట్టుకునేందుకు పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. రెండు రోజుల పాటు సాగిన గాలింపు చర్యల అనంతరం ఆ ఇద్దరు ఖైదీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, వారం వ్యవధిలో రెండు జైలు పరార్ ఘటనలు జరగడం రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జైలు, సంస్కరణ సేవల విభాగానికి చెందిన పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ సందీప్ రాయ్ రాథోర్‌ను కూడా బదిలీ చేసినట్లు సమాచారం.

టెక్స్‌టైల్ రంగానికి కేంద్రం బూస్ట్!

న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): దేశీయ టెక్స్‌టైల్ రంగానికి అవసరమైన పత్తి లభ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పత్తి దిగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న సుంకం మినహాయింపు గడువును 2026 డిసెంబర్ 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రకటించిన ఈ మినహాయింపు గడువు 2026 అక్టోబర్ 31తో ముగియనుండగా, తాజాగా మరో 2 నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేశారు.

తగ్గనున్న తయారీ వ్యయం..

కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో జౌళి, దుస్తుల తయారీదారులకు ముడిసరుకు వ్యయం తగ్గి, గణనీయమైన ఉపశమనం లభించనుంది. ఫలితంగా ఉత్పత్తిదారులు, వినియోగదారులు ఇద్దరికీ లబ్ధి చేకూరనుంది. దేశీయ పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటూనే, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కేంద్రం ఈ మినహాయింపును విస్తరించింది. మార్కెట్లో పత్తి కొరత లేకుండా మెరుగైన లభ్యతను అందుబాటులోకి తేవడం ద్వారా, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరుపై ఈ నిర్ణయం సానుకూల ప్రభావం చూపుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ ఆస్తులను చౌకగా అమ్మేస్తారా?



న్యూస్ డెస్క్, 31 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశానికి ఆస్తులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ, తక్కువ విలువకు కట్టబెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.

తక్కువ విలువ కట్టడం ఆందోళనకరం..

ఐడీబీఐ బ్యాంక్ విలువను తగ్గించి చూపిస్తున్నట్లుగా వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. బిడ్డింగ్ ఆఫర్లు రిజర్వ్ ధర కంటే తక్కువగా వచ్చినప్పుడు, నిబంధనలు, వ్యాల్యుయేషన్ పద్ధతులను ఎందుకు మార్చాల్సి వచ్చిందని ఆయన నిలదీశారు. ఇక ఐడీబీఐ బ్యాంక్‌కు అత్యంత విలువైన రియల్ ఎస్టేట్ ఆస్తులు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రైమ్ ల్యాండ్స్‌తో సహా కీలక నగరాల్లో ఉన్న బ్యాంక్ ఆస్తుల విలువను సరిగ్గా లెక్కించారా.. లేదా కావాలని తగ్గించి చూపిస్తున్నారా అని ప్రశ్నించారు.

ఉద్యోగుల ఆందోళనల పట్టదా..

ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగులు లేవనెత్తుతున్న న్యాయమైన సందేహాలను, ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని కేటీఆర్ నిలదీశారు. ఒక ప్రసిద్ధ ప్రభుత్వ రంగానికి చెందిన నిలకడైన బ్యాంక్‌ను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే ముందు, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రశ్నలకు దేశ ప్రజలకు సూటిగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అసలు ఈ విక్రయం విషయంలో కేంద్రానికి ఉన్న తొందర ఏమిటని కేటీఆర్ మండిపడ్డారు.

ఇస్రో సత్తాకు ప్రధాని కితాబు!

మొదటి పేజీ తరువాయి

అలాగే, ప్రజలకు ఉపయోగపడే నావిగేషన్ సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ ఉపగ్రహం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు.

NavIC వ్యవస్థ బలోపేతానికి కీలక అడుగు

NVS-03 మిషన్ విజయం భారత్‌కు చెందిన స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ NavICను మరింత బలోపేతం చేసే ముఖ్యమైన అడుగుగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారత్ కీలక సాంకేతిక రంగాల్లో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ విజయం మరో ముందడుగని తెలిపారు. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, వినూత్న ఆలోచనలు దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత గర్వపడేలా చేస్తున్నాయని ప్రధాని మోడీ కొనియాడారు.

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కూడా ఇస్రోకు అభినందనలు తెలిపారు. NVS-03 మిషన్ విజయం అంతరిక్ష సాంకేతిక రంగంలో భారత్ పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వదేశీ నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే భారత్ సంకల్పానికి ఈ విజయం ప్రతిబింబమని అన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్‌కు పెరుగుతున్న శక్తి

భారత అంతరిక్ష రంగంలో వస్తున్న విజయాలు విక్రమ్ సారాభాయ్, సతీష్ ధవన్ వంటి అంతరిక్ష రంగ దిగ్గజాలు కన్న కలలకు నిదర్శనమని జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలు, అంతరిక్ష రంగానికి అందిస్తున్న ప్రోత్సాహం భారత్ సాధిస్తున్న విజయాలకు బలమైన పునాది వేశాయని తెలిపారు.

NVS-03 మిషన్ ఎందుకు ముఖ్యమైనది?

NVS-03 ఉపగ్రహం భారత్ స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ అయిన NavICకు కీలకమైనది. అధునాతన సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం భారత నావిగేషన్ సేవలను మరింత మెరుగుపరచడంలో సహాయపడనుంది. కీలక సాంకేతిక రంగాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గిస్తూ, స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి కూడా ఈ మిషన్ బలాన్ని చేకూరుస్తుంది.

"ఢిల్లీనా.. ఢాకానా?".. బంగ్లాలో రచ్చ!

మొదటి పేజీ తరువాయి

షేక్ హసీనా వ్యతిరేక ఉద్యమంలో కూడా ఈ ఎన్సీపీనే కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు, ఆ పార్టీ ఢాకాలోని నేషనల్ మ్యూజియం ఎదుట భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. దేశంలో నెలకొన్న పరిస్థితులకు బాధ్యత వహిస్తూ హోం, ఇంధన శాఖ మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో.. "ఢిల్లీనా.. ఢాకానా.?" అని నినదించగా, అక్కడ ఉన్న వారు "ఢాకా.. ఢాకా.." అంటూ ప్రతిస్పందించారు. ఈ ఏడాది ప్రారంభంలో బంగ్లాదేశ్ ఎన్నికల్లో భారత వ్యతిరేకతను ప్రధాన అస్త్రంగా చేసుకుని అక్కడి విద్యార్థి నేతల పార్టీ ఎన్సీపీ ప్రచారం చేసింది. ఈ ప్రచారంలో భారత ఈశాన్య రాష్ట్రాలను విడదీస్తామని ఎన్సీపీ ఎంపీ హస్నత్ అబ్దుల్లా హెచ్చరించారు. తాజాగా జరిగిన ర్యాలీలో ఇతను కూడా పాల్గొన్నాడు.

భారత్‌పై కుట్రల ఆరోపణలు..

భారత్ బంగ్లాదేశ్‌పై కుట్రలకు పాల్పడుతోందని విద్యార్థి నేతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా భారత్ కుట్రల నుంచి దేశాన్ని రక్షించలేకపోతోందని విద్యార్థి నేతలు ఆరోపిస్తున్నారు. సరిహద్దుల్లో హత్యలు జరుగుతున్నాయని, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలు వేధింపులకు గురవుతున్నారని ఎన్సీపీ నేత నహిద్ ఇస్లాం అన్నారు. ఢిల్లీలో మసీదులను కూల్చే ప్రణాళికలు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అయితే, ఆయన వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లేవు.

ఇదే కాకుండా గంగా నది ఒప్పందాన్ని కూడా ప్రస్తావించారు. బంగ్లాదేశ్‌కు న్యాయమైన వాటా దక్కేలా ఈ ఒప్పందాన్ని తిరిగి సవరించకపోతే మరోసారి ప్రజలు వీధుల్లోకి వస్తారని తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భారత్-బంగ్లా మధ్య కుదిరిన 30 ఏళ్ల గంగా జలాల ఒప్పందం ఈ డిసెంబర్‌తో ముగియనుంది. డిసెంబర్ 12లోగా కొత్త ఒప్పందాన్ని ఖరారు చేయాలని బంగ్లాదేశ్ జలవనరుల మంత్రి కోరుతున్నారు.

షేక్ హసీనా తర్వాత పెరిగిన భారత వ్యతిరేకత..

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత, ఆమె భారత్ పారిపోయి వచ్చిన తర్వాత ఆ దేశంలో భారత వ్యతిరేక పెరిగింది. తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ ఈ వ్యతిరేకతను పెంచిపోషించారు. ఇదే సమయంలో యూనస్ మతోన్మాద సంస్థ జమాతే ఇస్లామీకి క్లీన్ చిట్ ఇవ్వడంతో పాటు ఆ పార్టీ నేతల్ని జైళ్ల నుంచి విడుదల చేశారు. దీంతో వీరంతా బంగ్లాలో రాడికల్ ఇస్లాం భావజాలాన్ని పెంచిపోషించారు. ఇప్పుడు జమాతే ఇస్లామీ బంగ్లాలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉంది.

సర్కార్ ఆస్పత్రుల్లో ఉచిత ఎంఆర్ఐ!

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం కోటిలోని TGMSIDC కార్యాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు.

మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో పైలట్ ప్రాజెక్ట్.. రెండేళ్లలో స్టేట్ వైడ్ రోలౌట్

ఈ నూతన విధానాన్ని మొదటగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాలు, అనుభవాలను ఆధారంగా చేసుకుని రాబోయే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జీజీహెచ్‌లలో పీపీపీ మోడ్‌లో ఎంఆర్ఐ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు నిర్వహించినా, సేవల నాణ్యత, రిపోర్టుల వేగం , మెషిన్ల మెయింటెనెన్స్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

తమిళనాడు మోడల్‌పై స్టడీ.. ప్రభుత్వానికి 20 శాతం మేర తగ్గనున్న ఖర్చు

ప్రస్తుతం హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్, టిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌తో పాటు వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, భూపాలపల్లి జీజీహెచ్‌లలో మాత్రమే ఎంఆర్ఐ సదుపాయం ఉంది. కరీంనగర్, ఖమ్మం, నల్గొండ వంటి ఉమ్మడి జిల్లాల్లో ఈ సేవలు లేకపోవడం, ఉన్న చోట కూడా సాంకేతిక సమస్యల వల్ల తరచూ అంతరాయం కలగడంతో రోగులు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో అమలువుతున్న పీపీపీ విధానాలపై అధికారులు, డాక్టర్ల బృందం అధ్యయనం చేసింది. ఈ విధానం వల్ల యంత్రాల కొనుగోలు, నిర్వహణ భారం ప్రభుత్వానికి దాదాపు 20 శాతం తగ్గుతుందని, బ్రేక్‌డౌన్ లేకుండా నిరంతరం ఎంఆర్ఐ సేవలు అందుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

పేదలకు అత్యాధునిక వైద్యమే లక్ష్యం

ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క పేషెంట్ కూడా వైద్య పరీక్షలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో డాక్టర్లు సూచించిన ప్రతి పేషెంట్‌కు ఉచితంగా ఎంఆర్ఐ పరీక్షలు జరిగేలా ఒప్పంద నిబంధనలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, TGMSIDC ఎండీ గౌరవ్ ఉప్పల్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాత నేతలతో కొత్త చిక్కులు!

మొదటి పేజీ తరువాయి



ఈ ఊహాగానాలే ఇప్పుడు గులాబీ పార్టీలో కొత్త అసమ్మతి మంటలు రేపుతోందా అనే టాక్ వినిపిస్తోంది.

కొండా యూ టర్న్ తో చర్చ:

రాజకీయాల్లో వలసలు కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి, ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి నేతలు మారడం సహజమే. కానీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఉద్దేశించి గతంలో చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి కొండా సురేఖ ఉపసంహరించుకోవడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. మంత్రి వర్గం నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ తిరిగి బీఆర్ఎస్ గూటివైపు చూస్తున్నారని అందులో భాగంగానే ఆమె తన వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకుందనే చర్చ తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో మరి కొంత మంది అధికార పార్టీకి చెందిన నేతలు సైతం కారు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ ప్రచారానికి ఇప్పటివరకు సంబంధిత నేతల నుంచి కానీ, బీఆర్ఎస్ నాయకత్వం నుంచి కానీ అధికారికంగా ధృవీకరించకపోయినా సోషల్ మీడియాలో మాత్రం జోరుగా చర్చ జరుగుతోంది. ఇందులో ఎవరు చేరుతారు ఎవరు చేరరో అనే విషయం అలా ఉంచితే చేరికల అంశం ఇప్పుడు గులాబీ పార్టీలో కొత్త తలనొప్పికి కారణం కాబోతోందా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కష్టకాలంలో పార్టీని వదిలిన వారికి ఇప్పుడు స్వాగతమా?

చేరికల అంశంపై గులాబీ పార్టీ మద్దతుదారుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పార్టీని వీడిన నేతలకు మళ్లీ పార్టీలో చేర్చుకునే ఆలోచన అధిష్టానానికి ఉంటే అది కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన నాయకులకు ఎలాంటి సందేశం ఇస్తున్నట్లు అనే సందేహాలు గులాబీ పార్టీ సొంత మద్దతుదారులే ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా పలువురు పార్టీ మద్దతుదారులు చేస్తున్న పోస్టులు చర్చనీయాశం అవుతున్నాయి. పార్టీని ఇబ్బంది పెట్టిన వారిని తిరిగి చేర్చుకుంటే ఇంతకంటే దరిద్రం ఇంకొకటి ఉండదంటూ పరుష పదజాలంతో పోస్టులు చేస్తున్నారు.

కేసీఆర్ కు మరో పరీక్ష:

ఓ వైపు అధికారానికి దూరం మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి దూకుడుతో బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత ప్రభుత్వం నాటి అంశాలపై దర్యాప్తులు గులాబీ పార్టీని వెంటాడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చేరికల విషయంలో క్యాడర్ సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకిస్తుండటం రాబోయే ఎన్నికల నాటికి గులాబీ బాస్ కేసీఆర్?కు మరో తలనొప్పి వ్యవహారం అనే టా

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 01-11-2026

బొల్లక్‌పల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా పాటించాలని సూచించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సామాజిక బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేందర్, ఎంపీడీవో సాయన్న, ఎస్సై బి. ఆంజనేయులు,సంక్షేమ శాఖ అధికారి (ఎఓ), గ్రామ సర్పంచ్ విట్టల్ పంచాయతీ కార్యదర్శి సునీత,తో పాటు గ్రామస్థులు భాను ప్రసాద్, పాల్గొన్నారు. పౌర హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

పోలీసు విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పిట్లం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బి. ఆంజనేయులు ఆధ్వర్యంలో పిట్లం ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు వ్యవస్థ విధులు, బాధ్యతలు, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ కార్యకలాపాలు, ప్రజలకు అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ, సర్దార్‌పటేల్ సేవలు చిరస్మరణీయం

- నల్లాల వినయ్ కుమార్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :దేశ తొలి మహిళా ప్రధానమంత్రి భారతరత్న ఇందిరాగాంధీ, భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌లకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అఖండ భారత నిర్మాణానికి పునాది వేశారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం జీవితాలను అంకితం చేసిన ఈ ఇద్దరు మహనీయుల ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

వైభవంగా కొండాపూర్ తొలిచుక్క కుమారస్వామి రిటైర్మెంట్ వేడుక

- హాజరైన ఆర్‌టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని రంగ కన్వెన్షన్ హాల్ లో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కొండాపూర్ గ్రామానికి చెందిన తొలిచుక్క కుమారస్వామి (శ్యామ్) ఉద్యోగ విరమణోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన కుమారస్వామిని ఆయన శాలువాలు, పూలమాలలతో ఆత్మీయంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి మాట్లాడుతూ కుమారస్వామి తనకు చిరకాల మిత్రుడని, అత్యంత ఆప్తుడని తెలిపారు. ఆయనతో తనకు ఎన్నో ఏండ్లుగా ఎంతో గాఢమైన అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. ఉద్యోగ ప్రస్థానంలో కుమారస్వామి అందరితో కలుపుగోలుగా ఉంటూ, సుదీర్ఘ కాలం పాటు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యుత్ శాఖ వంటి బాధ్యతాయుతమైన రంగంలో ఎంతో నిష్ఠతో పనిచేసి మంచి ఉద్యోగిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడం చాలా గొప్ప విషయమని అయోధ్యరెడ్డి ప్రశంసించారు. శ్యామ్‌గా అందరి హృదయాల్లో నిలిచిన ఆయన పదవీ విరమణ తదనంతర జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని కుమారస్వామికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగ విరమణ పొందిన లైన్‌మెన్ దంపతులకు బీర్ల అయిలయ్య ఘన సత్కారం.



ఇది కద నిజం :తుర్కపల్లి మండల కేంద్రంలో కొండాపూర్ గ్రామానికి చెందిన తొలిచుక్క కుమారస్వామి (లైన్‌మెన్) ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన కుమారస్వామి గారిని, వారి సతీమణిని శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఉద్యోగ జీవితంలో అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలందించిన కుమారస్వామి గారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండా ఎఐటియుసి జెండా

- యాదగిరిగుట్టలో ఘనంగా ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం



ఇది కద నిజం:అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం వద్ద ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు ఎఐటియుసి జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైనటువంటి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణబండి జంగమ్మ, పేరబోయిన మహేందర్ లు మాట్లాడుతూ ఏఐటియుసి 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఆవిర్భావించిన ఏఐటీయుసిలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు లాలా లజపతిరాయ్ మొదటి అధ్యక్షునిగా ఎన్నికై దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం అసంఘటిత రంగంలో పనిచేస్తున్నటువంటి కార్మికుల సమస్యల కోసం పోరాటాలు ఉధృతం చేసి అనేక హక్కులను సాధించినటువంటి ఘనత ఏఐటీయుసి,1927లో ఏఐటీయూసీకి అధ్యక్షులుగా మన దేశ ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ అలాగే స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్, వివి గిరి లాంటి ఎందరో మహాయోధులు అధ్యక్షులుగా కొనసాగిన చరిత్ర ఏఐటియుసి అని కార్మికుల సమస్యలను జాతీయ రాజకీయాలలో చర్చకు తీసుకరావడంలో కార్మిక అసంఘటిత శక్తిని అవసరాన్ని చాటడం ఈ సంఘం ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయని కొనియాడారు. అదేవిధంగా ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేకమైనటువంటి నల్ల చట్టాలు తీసుకురావడం వలన కార్మికులకు ఎంతో అన్యాయం జరుగుతుందని తక్షణమే ఈ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సినటువంటి ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పేర బోయిన పెంటయ్య, పేరబోయిన బంగారు, మాటూరి మల్లయ్య,ఆరె పుష్ప, ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు కళ్లెం సిద్దులు, చిన్న వ్యాపారుల సంఘం అధ్యక్షులు చందు నాయక్, బొమ్మిడి నరసింహ, హమాలి సంఘం అధ్యక్షులు కొండల్, ఇస్తారీ, విజయ్, శ్రీనివాస్, శీను, సాయినాథ్,నరసింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల





ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి జిల్లా: జనార్దనానంద సరస్వతి స్వామి సంస్మృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీ నుండి యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహించబడుతున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల విచ్చేశారు. ఈ సందర్భంగా కొండపైన అతిథి గృహం వద్ద రాష్ట్ర గవర్నర్ కి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు , ప్రభుత్వ విప్ మరియు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య , దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ కుటుంబ సమేతంగా లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గవర్నర్ తో పాటు విచ్చేసిన మంత్రివర్యులు, శాసనసభ్యులు మరియు ఇతర ఉన్నతాధికారులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, ఐఏఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు.దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి స్వామివారి జ్ఞాపిక (మొమెంటో), ప్రసాదాలను గవర్నర్ కి అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆవిష్కరించారు.

జమాల్ పురంలో ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన

ఇది కద నిజం న్యూస్
పర్వతగిరి/అక్టోబర్ 31



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం,జమాల్ పురం గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ఎంపీడీఓతో కలిసి ఇంకుడు గుంత నిర్మాణానికి సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు.గ్రామంలో ప్రతి ఇంటి నుండి వచ్చే మురుగు నీటిని రోడ్లపైకి,వృథాగా పోనీయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించడం వల్ల గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని,అదే సమయంలో భూగర్భ జలాలు పెరుగుతాయని సర్పంచ్ తెలిపారు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు



స్టేషన్ ఘనపూర్, ఇది కద నిజం , అక్టోబర్ 31:

చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన భీమగోని అనిత మొగిలి దంపతుల కుమార్తె రోహిత ఎంబీబీఎస్ లో ప్రభుత్వ కోటాలో సీటు సాధించింది. ఫాదర్ కొలంబో వైద్య కళాశాలలో ఆమెకు సీటు రావడం గ్రామస్థులు, కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. రోహిత చిన్నపెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిమల్ల సంపత్ మరియు చిలుపూరు మండల విద్యాశాఖ అధికారి గోవర్ధన్, ఉపాధ్యాయ బృందము సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వంగా ఉందని పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని రోహిత నిరూపించిందని అన్నారు.

హైదర్‌గూడాలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు



ఇది కద నిజం, అత్తాపూర్:రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌గూడా చౌరస్తా, పిల్లర్ నెంబర్ 143 వద్ద ఉన్న పటేల్ చౌరస్తాలో భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఉప ప్రధానమంత్రి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ , సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ వ్యవస్థాపకులు నారగూడం మల్లారెడ్డి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమరయ్య, బొక్క బాల్‌రెడ్డి మల్లేష్ యాదవ్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ కాకులారం కృష్ణ సత్యనారాయణ నాళ్లింగ్ రమేష్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి జి రాజు జయానంద్ బీట్కూరు సిద్దేశ్వర్ సందీప్ నరేష్ సతీష్ శివరాజ్ గౌడ్ భరత్ జితేందర్ సింగ్ కైలా రవీందర్ రెడ్డి పెంటల సుధాకర్ రెడ్డి శ్రీధర్ రెడ్డి అనిల్ జనార్దన్ లకన్ రెడ్డి సరిత వాసు గాయత్రి అమృత కృష్ణవేణి శశికళ వినోద్ సింగ్ సుల్గే శ్రీను సహదేవ రెడ్డి శేఖర్ శెట్టి మేడం రాము తదితరులు పాల్గొన్నారు

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 01-11-2026



'మైసా'

ఫస్ట్ సింగిల్ డేట్ ఫిక్స్!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' . రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేయడానికి సిద్ధం చేస్తున్నారు. గోండు గిరిజనుల విలక్షణ సంస్కృతి, జీవన విధానం నేపథ్యంగా భావోద్వేగాలు, పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రాబోతోంది. అన్‌ఫార్ములా ఫిలిమ్స్ బ్యానర్‌పై అజయ్, అనిల్ సయ్యపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతుండటంతో మేకర్స్ ప్రమోషన్ల జోరు పెంచారు.

అందులో భాగంగా ఈ చిత్రం మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు. 'మైసా యుద్ధ నినాదం మొదలైంది.. 'ఓ మైసారే' పాట నవంబర్ 2న విడుదల కాబోతోంది' అని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ అద్భుతమైన స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ భారీ పీరియడ్ డ్రామాలో సముద్రఖని, ఈశ్వరీ రావు, రాహుల్ రవీంద్రన్, ప్రవీణ్ దాచరం, తారక్ పొన్నప్ప వంటి నటీనటులు కీలక పాత్రల్లో అలరించబోతున్నారు. రష్మిక డిఫరెంట్ లుక్‌తో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



100 మంది కళాకారులతో డీఎస్పీ విధ్వంసం!

'పుష్ప' పాటలతో యావత్ ప్రపంచాన్ని ఊపేసిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్, ఈసారి అంతకుమించిన హై-ఓల్టేజ్ మాస్ విధ్వంసానికి రంగం సిద్ధం చేశారు. 'బలగం' సినిమాతో హృదయాలను కదిలించిన దర్శకుడు వేణు ఎల్దండి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎల్లమ్మ'. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ప్లాన్ చేసిన ఒక అన్‌బిలీవబుల్ మ్యూజికల్ అప్‌డేట్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. 'ఎల్లమ్మ' టైటిల్ ట్రాక్ కోసం డీఎస్పీ గతంలో ఎన్నడూ చూడని రీతిలో భారీ ప్రయోగం చేశారు. కేవలం కంప్యూటర్ బీట్స్, ఆర్టిఫిషియల్ సౌండ్స్‌పై ఆధారపడకుండా.. దేశవ్యాప్తంగా విభిన్న సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే దాదాపు 100 మంది ఒరిజినల్ జానపద రిథమ్ కళాకారులను ఒకే దగ్గరకు తీసుకొచ్చారు. వారందరితో కలిసి లైవ్‌లో ఈ టైటిల్ సాంగ్‌ను రికార్డ్ చేయించారు. 100 మంది వాయిద్యకారుల దరువులతో సాగే ఈ పాట థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించడం పక్కా అని సమాచారం.

ఈ సెన్సేషనల్ టైటిల్ సాంగ్‌ను 'ఫస్ట్ సింగిల్' రూపంలో త్వరలోనే అధికారికంగా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్వీసీ) పతాకంపై దిల్ రాజు, శిరీష్, హన్షిత రెడ్డి, హర్షిత్ రెడ్డి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మురళి జీ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం వినిపిస్తుంది. వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది. వేణు ఎల్దండి ఎమోషనల్ కథనానికి తోడు, డీఎస్పీ సృష్టించిన ఈ జానపద శబ్దం బాక్సాఫీస్ వద్ద మరోసారి పూనకాలు తెప్పించడం ఖాయంగా కనిపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



గ్యాంగ్‌తో రెడీగా ఉండండి ట్రైలర్ వచ్చేస్తోంది!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ 'వేట్టువం' విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపొకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ 'మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్' తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది.

ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ, వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

సంక్రాంతి బరిలో 'వేట్టువం'!



'ఆదర్శ కుటుంబం'పై పాట వివాదం!

టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధమవుతున్న తమ 'పర్ణశాల' సినిమాలోని 'జిమ్ జిమ్ తార' పాటను 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో అనుమతి లేకుండా ఉపయోగించడంపై ఆ సినిమా నిర్మాత మంచి వెంకట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హీరో వెంకటేష్‌కు సంబంధించిన ఓ సన్నివేశంలో తమ సినిమా పాటను వినియోగించారని, సినిమా విడుదల కాకముందే ఇలా పాటను వాడటం చిన్న సినిమాకు అన్యాయం చేయడమే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికే ఆదిత్య మ్యూజిక్ ద్వారా అధికారికంగా విడుదల చేసిన తమ పాటను మరో చిత్రంలో ఇలా వాడటం వల్ల తమ సినిమాకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఇది చిన్న సినిమాల మనుగడకు ఇబ్బందికరంగా మారుతుందని ఆయన వాపోయారు. ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ బ్యానర్‌పై మంచి వెంకట్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వై.జి. భరత్ దర్శకత్వం వహిస్తుండగా, హారర్ కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

